క్లుప్తంగా

ఎమ్మార్సీ ఎదుట ప్రజాసంఘాలు నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘ నాయకులు

ములకలచెరువు : స్థానిక కస్తూర్బా పాఠశాలలో బాలికలతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని మంగళవారం ప్రజాసంఘ నాయకులు నిరసన నిర్వహించారు. కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాఠశాల సిబ్బంది బాలికలతో వెట్టి చాకిరీ చేయించడం తగదన్నారు. సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, మల్లికార్జున, సోము తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం



స్వామివారికి వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రామసముద్రం : మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీ గట్టు వెంకటేశ్వరస్వామి రథోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారికి వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ అర్చకులు రామచంద్ర భట్టర్ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. స్వామివారిని గ్రామ వీధుల్లో ఘనంగా ఊరేగించారు.

బాలువికాస్‌కు ఘన సన్మానం



బాలువికాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పీలేరు : కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సీజీఎల్ 2024లో విశేష ప్రతిభతో జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా సెలెక్ట్ అయిన ఇందిరానగర్‌కు చెందిన జొన్నగడ్డల బాలువికాస్‌కు ఘన సన్మానం లభించింది. మంగళవారం స్థానిక వీఎస్ఎన్ సిద్దార్థ పాఠశాల యాజమాన్యం దుశ్శాలువతో సత్కరించారు. కరస్పాండెంట్ మాధవి మాట్లాడుతూ తమ పాఠశాలలో పదో తరగతి చదివిన బాలువికాష్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా సెలెక్ట్ కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువల ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వెంకటరమణ

పీలేరురూరల్ : మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీ నుంచి తుమ్మలవారిపల్లె వరకు వెళుతున్న సప్లై చానల్ ఆక్రమణకు గురైందని ఆ గ్రామానికి చెందిన ఎస్. వెంకటరమణ తహసీల్దార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబరు 1024, 1025, 1026 చుట్టు పక్కలా రైతులు సుమారు 2 కిలోమీటర్లు పొడవు ఉన్న కాలువను ఆక్రమించారన్నారు. సమగ్రంగా సర్వే నిర్వహించి సప్లయ్ చానల్ యథావిధిగా ఉండేటట్లు చూడాలని కోరారు.

రేపు చేపల చెరువు వేలం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రం చెరువులో చేపల పెంపకం కోసం గురువారం వేలం నిర్వహిస్తామని కార్యదర్శి సురేఖ, సర్పంచ్ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఒక రోజు ముందుగా రూ.87,500ల డిపాజిట్ సొమ్మును రాపూరివాండ్లపల్లి సచివాలయంలో చెల్లించాలని వారు సూచించారు.

అయ్యప్పస్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



ఆలయ హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ హుండీ ఆదాయం లెక్కించారు. దేవదాయశాఖ కార్యనిర్వాహణ అధికారి రమణ ఆధ్వర్యంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు హుండీ ఆదాయం లెక్కించగా రూ.1,99,520 ఆదాయం వచ్చినట్లు ఈఓ రమణ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు విజయలక్ష్మి భాస్కర్, జర్మనీరాజు, ఎం.బాలకృష్ణయాదవ్, మల్లేనాయక్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ.. మామూళ్లతో మమ

- గంటన్నరలో ముగిసిన బహిరంగసభ
- సభకు హాజరుకాని లబ్ధిదారులు
- ప్రతి పనికి 2 నుంచి 5 శాతం కమీషన్ల వసూలు చేసిన తనిఖీ సిబ్బంది



సామాజిక తనిఖీ బహిరంగ సభలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

పీలేరు : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో అవినీతిని వెలికితీయడమే లక్ష్యంతో పారదర్శకంగా నిర్వహించాల్సిన సామాజిక తనిఖీ మామూళ్లతో సరిపెట్టుకోవడంతో లక్ష్యం నిర్వీర్యం అయింది. మండలంలో 2023 ఏప్రిల్ 01 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు రూ. 8,54,83,705తో చేపట్టిన 3721 పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. వారం రోజులుగా మండలంలో అన్ని పంచాయతీల్లో గ్రామ నిర్వహించి, క్షేత్ర స్థాయి పనులు పరిశీలించి, అవినీతిని వెలికి తీయాల్సి ఉంది. అయితే సామాజిక తనిఖీ సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి అధికారులు, సిబ్బందితో కుమ్మక్కై మామూళ్లతో సరిపెట్టుకున్నారు. చేసిన పనులకు 2 శాతం నుంచి 5 శాతం వరకు మామూళ్ల వసూలు చేసినట్లు బహిరంగంగానే చర్చించుకోవడం గమనార్హం. కొన్న చోట్లా మరో అడుగు ముందుకేసి నాసికరకంగా పనులు చేశారని బెదిరించి వసూళ్లు చేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభ గంటన్నరలోనే మమ అనిపించి ముగించేశారు. బహిరంగ సభకు ఒక్క రైతుగానీ, లబ్ధిదారులు గానీ హాజరు కాకపోవడం గమనార్హం. బహిరంగ సభకు హాజరైన డ్వామా పీడీ వెంకటరత్నం మాట్లాడుతూ మండలంలో కొన్ని గ్రామాల్లో పనులు చేయకపోయినా బిల్లులు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏడాది కాలంలో జరిగిన పనులు, చెల్లింపులకు సంబంధించి అవకతవకలకు గానూ రూ. 38,843 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీవో శివశంకర్, ఎస్ఆర్‌పీ మురషాద్, ఏపీవో అశోక్‌రెడ్డి, మహేష్, డీఆర్‌పీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

పెద్దమండ్యం : మండలంలోని పాపేపల్లెలో కుషావతీ నది ఒడ్డున ఏకశిలగుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం తెల్లవారు జామున స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, తీర్థప్రసాదాలు, పగలు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామివారిని శ్రీదేవి, భూదేవిలతో కలిసి వైభవంగా ఊరేగింపు చేశారు. స్వామివారికి పట్టువస్త్రాలను చిన్నమండ్యం మండలం పడమటికోనకు చెందిన బోడిచెర్ల రామమూర్తి కుటుంబ సభ్యులు అందజేశారు. కల్యాణోత్సవంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవిత పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కళ్యాణోత్సవం అనంతరం స్వామివారిని రథంపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చాందినీ బండ్లతో భక్తులు మొక్కులు తీర్చుకొన్నారు. ఎస్ఐ పివి రమణ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో మునిరాజు, గుడిశ క్రిష్టారెడ్డి, సర్పంచ్ పీరాన్‌బి, ఎంపీటీసీ బోడిమాని గీత, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రవిచంద్ర, అర్చకులు వై విష్ణుమాచార్యులు, యాజ్ఞికులు రఘునాధాచార్యులు, మణికంఠస్వామి పాల్గొన్నారు.

క్షయవ్యాధిని నిర్మూలిద్దాం



క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రేష్మ

కేవీపల్లె : ప్రజా భాగస్వామ్యంతో క్షయవ్యాధిని నిర్మూలిద్దామని గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షేక్ రేష్మ అన్నారు. క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలు మించి దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, సాయంత్రం జ్వరం రావడం లాంటి లక్షణాలు ఉంటే సమీపంలోని పీహెచ్‌సీలో ఉచితంగా గళ్ల పరీక్ష చేపించుకోవాలన్నారు. క్షయవ్యాధి నిర్ధారణ అయిన రోగికి ఉచిత చికిత్స తోపాటు ప్రభుత్వం నుంచి ప్రతి నెలా రూ. వెయ్యి చొప్పున ఆరు నెలల పాటు రోగి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పవన్ కుమార్, పర్యవేక్షకులు భాగ్యలక్ష్మీ, రమాదేవి, రుక్మిణి, పురుషోత్తం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్ పుణ్యకార్యం

పీలేరురూరల్ : పవిత్రమైన రంజాన్ మాసంలో పీలేరు కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలో మంగళవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డిబాబు, కార్యదర్శి అంబికాపతి, కోశాధికారి శంకరాచారి మాట్లాడుతూ తమ అసోసియేషన్ తోపాటు బహుజన బిల్డింగ్ వర్కర్స్, బిస్మిల్లా వెల్డర్స్, బిస్మిల్లా ఆటో యూనియన్‌లకు సంబంధించి సుమారు 600 మంది కార్మికులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇఫ్తార్ పుణ్యకార్యమని, ఇలాంటి కార్యక్రమాలు హిందూముస్లిం ఐకమత్యానికి దోహదం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారుడు వేణు ఆచారి, గౌరవాధ్యక్షులు మహబూబ్ బాషా, ఫారుఖ్‌బాషా, మోదీన్‌బాషా, గౌస్‌పీర్, కమల్‌బాషా, మునిరాజ, శివాచారి, కృష్ణమాచారి, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మతల్లికి వెండి వస్తువులు బహూకరణ



ఈఓ మంజులకు వెండి వస్తువులు అప్పగిస్తున్న దాతలు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన సంతాన దేవత శ్రీ రెడ్డెమ్మతల్లికి భక్తులు వెండివస్తువులను బహూకరించారు. సంబేపల్లె మండలం నల్లగుట్ట పల్లె గ్రామానికి చెందిన రెడ్డితారక్, పొత్తూరి చంద్రబాబు దంపతులు 1.19 కిలోల (రూ. 1.15 లక్షలు విలువచేసే) వెండిపళ్లెము, దీపాలను అమ్మవారికి బహూకరించారు. మంగళవారం ఆలయానికి చేరుకొన్న దాతలకు అర్చకులు ఆలయ సంప్రాదాయం ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అమ్మవారి శేష వస్త్రాలను, తీర్థప్రసాదాలను వారికి అందజేశారు. అనంతరం ఆలయ ఈవో మంజులకు వెండివస్తువులను దాతలు అందజేశారు.

రూ.3.87 కోట్లతో సిమెంటు రోడ్లు

పీఆర్ డీఈ మునిరాజ్ కుమార్



ఎంపీడీఓతో సమీక్షిస్తున్న డీఈఈ మునిరాజ్

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గంలో రెండో విడత పల్లె పండగ కార్యక్రమం ద్వారా రూ.3.87 కోట్లతో కొత్తగా సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టినట్టు డీఈఈ మునిరాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దిలీప్ కుమార్‌తో పనులపై సమీక్షించారు. మండలంలో చేపట్టిన మొదటి విడత పనుల పూర్తి, రెండో విడతలో మంజూరై రూ.87 లక్షల పనులు చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మునిరాజ్ మాట్లాడుతూ పీటీఎం మండలానికి రూ.90 లక్షలు, తంబళ్లపల్లెకు రూ.10 లక్షలు, కురబలకోటకు రూ.105 లక్షలు, ములకలచెరువుకు రూ.95 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. మొత్తం 97 పనులకు చేపట్టి తొమ్మిది కిలోమీటర్ల సిమెంటు రోడ్ల పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు.

హౌసింగ్ గ్రామసభలు



హౌసింగ్ గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

రామసముద్రం : మండలంలోని మినికి, కురిజల, మాలేనత్తం, కాప్పల్లె, చెంబకూరు, రాగిమాకులపల్లె, మూగవాడి, రామసముద్రం పంచాయతీలో సర్పంచుల అధ్యక్షతన మంగళవారం హౌసింగ్ గ్రామసభ నిర్వహించారు. గత ప్రభుత్వంలో మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అదనంగా బీసీలకు రూ.50వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.75వేలు సహాయం అందిస్తారని తెలిపారు. త్వరితగతిన లబ్ధిదారులు ఇంటినిర్మాణాలు చేపట్టాలని సూచించారు. గ్రామసభలో ఎంపీడీఓ భానుప్రసాద్, హౌసింగ్ ఏఈ రాజేశ్వరి, సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషిచేయాలి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎస్.ఏ.కరీముల్లా

మదనపల్లె : వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మంగళవారం బసినికొండలోని ఎమ్మెల్యే కార్యాలయంలో, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి ఎస్.ఏ.కరీముల్లా, తంబళ్లపల్లె ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర పదవికి సిఫారసు చేయడంపై పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ... కూటమిప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాలను గుర్తు చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99శాతానికి పైగా నెరవేర్చిన జగనన్నకు, అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయని చంద్రబాబుకు మధ్య తేడా ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, భవిష్యత్తు మనదేనని భరోసా కల్పించాలన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, వారి సమస్యలపై పోరాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దండాల రవిచంద్రారెడ్డి, కౌన్సిలర్ షేక్ షబానా, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్ తప్పనిసరి

- దేశభక్తి,సేవాభావానికి ప్రతీక స్కౌట్స్
- జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి



మాట్లాడుతున్న మడితాటి నరసింహారెడ్డి

మదనపల్లె సిటీ : అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్కౌట్స్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి అన్నారు. మదనపల్లె పట్టణం జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో మంగళవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్కౌట్స్‌లో ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలకు మార్చి 31వతేదీ లోపు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. పాఠశాలల్లో నిర్వహించవలసిన స్కౌట్స్ కార్యకలాపాల గురించి వారికి అవగాహన కల్పించారు. విద్యార్థులలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి స్కౌట్స్ శిక్షణ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, ఏఎస్ఓసి లక్ష్మికర్, అడ్వాన్స్ స్కౌట్స్ మాస్టర్స్ మహమ్మద్‌ఖాన్, రవీంద్రారెడ్డి, స్కౌట్స్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సభ్యులు లక్ష్మిరెడ్డి, స్కౌట్స్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్, కబ్ మాస్టర్స్, ఫ్లాక్ లీడర్స్ పాల్గొన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడు, స్కౌట్స్ మాస్టర్ వెంకటరమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మున్సిపల్ స్థలం ఆక్రమణకు ప్రయత్నం



ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ప్రభుత్వ స్థలంలో మట్టిని తోలిన కబ్జారాయుళ్లు

మదనపల్లె : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మెయిన్‌రోడ్‌కు ఆనుకుని ఉన్నటువంటి విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు కబ్జాదారులు ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారం ట్రాక్టర్లతో మట్టిని తోలి చదును చేసి ఆక్రమించేందుకు పూనుకున్నారు. గమనించిన స్థానికులు మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం అందించడంతో, విషయం తెలుసుకున్న కబ్జారాయుళ్లు మెల్లగా అక్కడి నుంచి జారుకున్నారు. పట్టణంలో ప్రధాన రోడ్లకు ఆనుకుని, ఇప్పటికే చాలామంది ప్రభుత్వ స్థలాల్లో బంకులు, చిన్నపాటి దుకాణాలు ఏర్పాటుచేసుకుంటున్నప్పటికీ మున్సిపాలిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వస్థలాల్లో ఏకంగా పెద్ద పెద్ద షెడ్లు వేసేందుకు కబ్జారాయుళ్లు వెనుకాడటం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : మండలంలోని రేణుమాకులపల్లె పంచాయతీ పల్లికుంటపల్లెకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త విశ్వనాథ్ (41) మంగళవారం హఠాన్మరణం చెందాడు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు. రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం గడ్డి కత్తిరించే యంత్రంలో చెయ్యి దెబ్బతిన్న మహిళ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే స్వగృహంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించి పలు విషయాలపై చర్చించారు. మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, వైఎస్ ఎంపీపీ కరీమ్, సర్పంచులు కె.జ్యోతి, మహమ్మద్‌బాషా, ఎంపిటీసీ మహేష్, నాయకులు కె.ఆర్.మల్లిరెడ్డి, కోటిరెడ్డి, రామశంకరరెడ్డి, చలపతి, కరీముల్లా, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాస విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

పశుసంవర్థకశాఖ ఏడీ సుమిత్ర



రైతులకు మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీ సుమిత్ర

తంబళ్లపల్లె : పశుగ్రాసం కొరత తీర్చేందుకు ప్రభుత్వ సబ్సిడీతో పంపిణీ చేస్తున్న పశుగ్రాస విత్తనాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థకశాఖ ఏడీ డాక్టర్ సుమిత్ర కోరారు. మంగళవారం పశువైద్యశాలలో రైతులకు సబ్సిడీ మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాలకు 16 టన్నుల పశుగ్రాస విత్తనాలు వచ్చాయన్నారు. 5 కేజీల బ్యాగు రూ.340 కాగా 75 సబ్సిడీపోను రైతు రూ.85 చెల్లించాలన్నారు. ఒక్కో రైతుకు అవసరాల మేరకు 5 నుంచి 40 కేజీల వరకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్యురాలు ఇందు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించండి



కత్తివారిపల్లెలో సిమెంట్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కలకడ : సిమెంట్ రోడ్డు ఏర్పాటులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ అబ్దుల్‌రహీం ఆదేశించారు. మంగళవారం మండలంలోని గంగాపురం పంచాయతీ కత్తివారిపల్లెలో జరుగుతున్న సిమెంట్‌రోడ్డు పనులను తనిఖీ చేశారు. సిమెంట్, కంకర, ఇసుక ప్రభుత్వ నిబంధనల మేరకు వినియోగించాలన్నారు. సిమెంట్ నిర్మాణ పనులకు విధిగా 21రోజులు నీటి నిల్వ ఉంచాలన్నారు. అనంతరం ప్రభుత్వపాఠశాలలను, గంగాపురం, కొత్తపల్లె అంగన్వాడికేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అందించే ఆహారం మెనూప్రకారం అందించాలని ఆదేశించారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలి

తంబళ్లపల్లె : తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించేందుకు రాజకీయపార్టీల నాయకులు ఏఈఆర్‌ఓలు సమష్టిగా కృషి చేయాలని ఎన్నికల నిర్వహణాధికారి రాఘవేంద్ర కోరారు.

మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితాపై ఏఈఆర్‌ఓలు, రాజకీయపార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన యువతి,యువకులకు ఓటు హక్కు కల్పించడం, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు సవరణలు, 1200కుపైగా ఓట్లును బూత్‌లను రెండుగా విభజించడం తదితర అంశాలపై చర్చించారు.

దండాలమ్మా.. దండు మారెమ్మా





ముదివేడు దండు మారెమ్మ ఆలయం (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

- నేడు ముదివేడు తిరునాల
- భారీ బందోబస్తు

కురబలకోట: పడమటి మండలాల్లో పేరొందిన ముదివేడు దండు మారెమ్మ తిరునాలకు ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యాయి. బుధవారం రాత్రి, గురువారం పగలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆరు సచివాలయాల పరిధిలోని గ్రామాలకు ముఖ్యమైన దేవతగా పూర్వం నుంచి పూజలందుకుంటున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. కోరిన కోర్కెలు అమ్మవారు తీరుస్తుందన్న నమ్మకం ఈ ప్రాంతం వారిలో ఉంది. వివిధ ప్రాంతాల భక్తులు వచ్చిమొక్కులు తీర్చుకుంటారు. భక్తులకు సౌకర్యంగా ఆర్టీసీ సంస్థ అదనపు బస్సులు నడుపుతోంది. ఈసారి 30 దాకా చాందినీ బండ్లు కడుతున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. రికార్డింగ్ డ్యాన్సులను నిషేధించారు. తిరునాల ప్రశాంతంగా జరిగేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి నట్లు డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. బందో బస్తును రూరల్ సీఐ సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ రద్దుచేయాలని నిరసన

- మాలలకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు
- సబ్ కలెక్టరేట్ ఎదుట మాలమహానాడు ఆందోళన



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

మదనపల్లె : మాల, మాదిగలను విడదీసే ఎస్సీ వర్గీకరణను రద్దుచేయాలని మాలమహానాడు ఆధ్వర్యంలో మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కూటమిప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ మాలమహానాడు కార్యదర్శి యమలా చంద్రయ్య మాట్లాడుతూ...గతంలో టీడీపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను తీసుకురాగా, హైకోర్టు కొట్టివేసిందన్నారు. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దుచేసి దేశంలోని రాష్ట్రాలకు సూచనలు ఇవ్వాలని కోరారు. ఎస్సీలను విభజించాలనే కుట్రతోనే బీజేపీ ప్రభుత్వం మాదిగలతో కుమ్మక్కై సుప్రీంకోర్టుకు తప్పుడు నివేదికలు ఇచ్చి ఎస్సీ వర్గీకరణ చేసుకునేలా తీర్పు వచ్చేలా చేసిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని, రాజకీయ లబ్ధి కోసం అన్నదమ్ముల్లాగా ఉన్న మాల, మాదిగ కులాల్లో చిచ్చుపెట్టవద్దని కోరారు. మాల మహానాడు అధికార ప్రతినిధి మల్లెల మోహన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో చంద్రబాబు అధికారం కోల్పోయిన నాటి నుంచి తిరిగి అధికారంలోకి వచ్చేంతవరకు అనేక అల్లర్ల కేసుల్లో ముద్దాయిలైన చరిత్ర మాలలకు ఉందన్నారు. 2024 ఎన్నికల్లో మాలలు కలిసికట్టుగా టీడీపీకి మద్దతు తెలిపితే, ఒకే కులానికి ప్రభుత్వం కొమ్ము కాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు సై అంటూ జైకొట్టి రాజకీయ లబ్ధిపొందాలని అనుకుంటున్నారన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టారని, తక్షణం దీన్ని రద్దు చేసి, క్రిమిలేయర్‌ను కూడా రద్దు చేయాలన్నారు. ఏబీసీడీ వర్గీకరణ నిలుపుదల చేయని పక్షంలో రాష్ట్రంలోని మాలలంతా కూడగట్టుకుని అసెంబ్లీని ముట్టడిస్తామని, వర్గీకరణ ఆపేస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలిసి ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా కార్యదర్శి మాణిక్యం, ఉపాధ్యక్షులు గుండా మనోహర్, కందూరులక్ష్మీపతి, రామచంద్ర, అప్పయ్య, ప్రశాంత్, అమర, శేషాద్రి, చలపతి, సీటీఎం రమణ, గంగాధర్, గంగరాజు, ఉమాపతి, శివాజీనగర్, గురుమూర్తి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.